క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో పేదలకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన మాట్లాడుతూ సరుకుల పంపిణీకి క్లబ్ కార్యదర్శి ఎస్.శ్రీదేవి సహకారం అందించారన్నారు. జోనల్ చైర్మన్ శ్రీరామ్ గణేష్, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కీళ్ల సమస్యలపై అప్రమత్తం



రోగులను పరీక్షిస్తున్న దాక్టరు అడ్డాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: వయసు పెరిగే కొద్దీ కీళ్ల సంబంధ సమస్యలు వస్తాయని వాటి పట్ల వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి కీళ్ల నొప్పులపై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎఫ్‌సీఎల్‌ను కాపాడుకుందాం

కాకినాడ సిటీ: ఎన్ఎఫ్‌సీఎల్‌ను కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు వస్తాయని ఆ సంస్థ నిర్మాణానికి రైతులు భూములు ఇస్తే నేడు నష్టాలు వస్తున్నాయని ఆ భూములతో సంస్థ యాజమాన్యం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆయన విమర్శించారు. గురువారం సీపీఐ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఉసురు కొట్టి గ్రీన్ కో గ్రూపునకు చెందిన ఏఎం గ్రీన్ అమోనియా, ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు విక్రయించడం దారుణమన్నారు. ఈనెల 21న ఉదయం 10 గంటలకు గాంధీ భవన్‌లో పలు అంశాలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు డేగల ప్రభాకర్, కె బోడకొండ, తోకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హరిధరరావుకు ఘనంగా వీడ్కోలు



హరిధరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న సిబ్బంది, కొత్త జెడ్ఎం మురళీమోహన్

కాకినాడ రూరల్: ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పనిచేస్తూ శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళుతున్న బడగల హరిధరరావుకు సిబ్బంది గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. రమణయ్యపేట ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో కొత్తగా జోనల్ మేనేజరుగా బాధ్యతలు చేపట్టిన ఎం.మురళీమోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది హరిధరరావును సత్కరించారు. జోనల్ మేనేజరుగాను, అంతకు ముందు డిప్యూటీ జోనల్ మేనేజరుగా, ఐలా ఈఓ అండ్ కమిషనర్‌గా సమర్థమైన సేవలందించారని సిబ్బంది కొనియాడారు. హరిధరరావు మాట్లాడుతూ తనను ఆత్మీయుడిగా చూసుకున్న సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉన్న మురళీమోహన్‌తో కలసి మెలసి పనిచేయాలని సూచించారు. అనంతరం సిబ్బంది పూల వర్షం కురిపిస్తూ ఆయనకు వీడ్కోలు పలికారు.

19న జార్జిపేట సర్పంచ్ ఎన్నిక

కాకినాడ సిటీ: జిల్లాలో తాళ్లరేవు మండలం జార్జిపేట సర్పంచ్ పదవితో పాటు వార్డు సభ్యులకు పెదపూడి మండలం కాండ్రేగుల, సామర్లకోట మండలం వేట్లపాలెం, చంద్రపాలెం, పెద్దాపురం మండలం దివిలి, గొల్లప్రోలు మండలం కొడవలి, ప్రత్తిపాడు మండలం గుజ్జనపూడి తదితర వార్డు సభ్యులకు ఈ నెల 19న ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి 1 గంట వరకు ఎన్నికలు జరుగుతాయి. అనంతరం మధ్యాహ్నం నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని అధికారులు వివరించారు.

జనసేన నాయకుల పర్యటన

కరప: మండలం వేములవాడలో గురువారం జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు, కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంతం నానాజీ జనం కోసం పవన్, పవన్ కోసం జనం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగితెలుసుకున్నారు.

నర్తనబాలల కళారాధన

- నృత్యంలో రాణిస్తున్న యువత
- జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కాకినాడ కళాకారుల ప్రతిభ
- చదువుతో సమానంగా కళల్లోనూ ప్రావీణ్యం

కాకినాడ కల్చరల్: విద్యార్థినులు కేవలం చదువులకే పరిమితం కాకుండా సాంస్కృతిక కళలల్లోనూ రాణిస్తున్నారు. జీవితంలో ముందుకు సాగడానికి చదువులకు కళలు ఆటంకం కాదని నిరూపిస్తున్నారు. నేటి చిన్నారులు, విద్యార్థులు వివిధ కళల్లో శిక్షణ పొందడం ద్వారా ఏకాగ్రత, మానసిక ప్రశాంతత చేకూరుతోందని చెబుతున్నారు. దీనికి తోడు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించడంతో వారి పిల్లలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తా చూపుతున్నారు. ఏలూరులోని వైఎంసీఏ సమావేశపు మందిరంలో అభినయ నృత్యభారతి సంస్థ ఇటీవల నిర్వహించిన నర్తనబాల అవార్డుల ప్రదానోత్సవంలో విద్యార్థినులు పాల్గొని చక్కని హావభావాలతో నృత్యం చేసి అలరించి కాకినాడకు మంచి పేరు తీసుకువచ్చారు. వారి సంతోషం వారి మాటల్లోనే..



నర్తనబాల పురస్కారం స్వీకరిస్తున్న విద్యార్థినులు

భారత సంస్కృతికి చిహ్నం



నృత్యం మన దేశ సంస్కృతికి చిహ్నం. ప్రస్తుతం నృత్యానికి ఆదరణ పెరుగుతోంది. నాట్యం నేర్చుకోవాలనే ఉన్నత ఆశయంలో ఉన్న విద్యార్థినులను గుర్తించి నర్తకీమణులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. నృత్యం నేర్పించి కళలను కాపాడేందుకు చిరుప్రయత్నం చేస్తున్నాం. అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇచ్చే స్థాయిలో నృత్యంలో శిక్షణ ఇస్తున్నాం.

– బేతా సత్యనారాయణ, నాట్యాచార్య, కాకినాడ

నాట్యం అంటే ప్రాణం



నా పేరు ఎం.నిహారికా రెడ్డి. నర్తనబాల పురస్కారం పొందడం చాలా సంతోషంగా ఉంది. ఐదో తరగతి చదువుతున్నాను. నాలుగేళ్లుగా కూచిపూడి నాట్యం అభ్యసిస్తున్నాను. చిన్న వయసులో అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉంది. అంతర్జాతీయ వేదికలపై నృత్య ప్రదర్శన చేసి మెప్పించాలని నా ఆశయం. మా తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉంది.

మంచి నర్తకిగా రాణిస్తాను



నా పేరు జి.సాత్విక. నర్తనబాల పురస్కారం పొందడం చాలా ఆనందంగా ఉంది. నేను ఏడో తరగతి చదువుతున్నాను. శాస్త్రీయ నృత్యం అంటే ప్రాణం. నృత్యంలో మరిన్ని మెళకువలు నేర్చుకుని అంతర్జాతీయ వేదికపై నృత్య ప్రదర్శన ఇవ్వాలనేది నా కోరిక. చదువుకు నా నాట్య సాధన ఆటంకం కాదు. మరింత ఏకాగ్రత పెరుగుతోంది

ఏకాగ్రత పెరుగుతోంది



నాపేరు ఎ.అక్షయ భావన. నర్తనబాల పురస్కారం పొందడం చాలా సంతోషంగా ఉంది. నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. పదేళ్లుగా నృత్యం సాధన చేస్తున్నాను. ఈ కళ సాధన చేయడం వల్ల ఏకాగ్రాత, క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం పెరుగుతాయి. సంప్రదాయ నృత్యాన్ని ఇష్టంతో సంతోషంగా సాధన చేయాలి. నాట్యరంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనేదే నా కోరిక.

చాలా సంతోషంగా ఉంది



నాపేరు టి.లోహిత శ్రీసాయి ప్రణవి. ఏడో చదువుతున్నాను. నర్తనబాల పురస్కారం రావడం సంతోషంగా ఉంది. మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నాట్య సాధన, ప్రదర్శనలు ఇవ్వగలుగుతున్నా. శివ తాండవం చేయడం చాలా ఇష్టం. ఎనిమిదేళ్లుగా నృత్యం నేర్చుకుంటున్నా. నాట్య భారతి, నాట్యసాయి అవార్డులు పొందాను. కూచిపూడి నృత్యంలో డిప్లమో చేయాలనే ఆశయంతో ఉన్నా.

దేశభక్తిని చాటుకున్న వైఎస్సార్ సీపీ నేత



జాతీయ జెండాలను సేకరిస్తున్న సత్తిబాబు

కరప: వర్షానికి నేలమీద పడిన జాతీయ పతాకాలను సేకరించి, గదిలో పెట్టించి, దేశభక్తిని చాటుకున్నారు మండల వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయజెండాలను తోరణాలుగా కట్టారు. గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి అవి కిందపడిపోయాయి. వాటిని సేకరించి, అటెండర్ వనుం భాస్కర్‌కు అందజేసి, కార్యాలయంలో పెట్టించారు.

27 నుంచి నృత్యకళా పోటీలు

కాకినాడ కల్చరల్: ఋషిపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'శివపదం' పేరుతో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు నృత్యకళా పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్ట్ కో–ఆర్డినేటర్ చావలి రామ్మూరి తెలిపారు. 27వ తేదీన ఉదయం 9 గంటల నుంచి పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే 28, 29వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి నృత్యపోటీలు నిర్వహిస్తామన్నారు. 5 నుంచి 15 ఏళ్ల లోపు జూనియర్స్ విభాగంగాను, 15 ఏళ్ల పైబడిన వర్గాలను సీనియర్స్ విభాగంగా పరిగణిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు ఆగస్టు 20వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 99631 10942 నంబర్‌లో సంప్రదించాలని చావలి కోరారు.

కోడింగ్ ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక



కలెక్టర్ కృతికా శుక్లాను కలసిన అభ్యర్థులు

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో గురువారం నిర్వహించిన డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీలో మెడికల్ కోడింగ్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు సుమారు 80 మంది అభ్యర్థులు హాజరు కాగా వీరిలో 10 మంది ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులు కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.18వేలు జీతం, రూ.6వేలు ఇన్సెంటివ్స్ ఉంటాయని వికాస పీడీ కె.లచ్చారావు వివరించారు. ఈ ఇంటర్వ్యూల్లో హెచ్ఆర్‌లు, మేనేజర్ పి.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా ఓటర్ల జాబితా సర్వే



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జులై 21వ తేదీన బీఎల్‌వోలతో చేపట్టిన ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే జిల్లాలో అత్యంత పారదర్శకంగా, సజావుగా సాగుతోందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ కోర్టు హాలులో డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డితో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే జిల్లాలో 79.76 శాతం మేర ఇళ్ల సర్వే పూర్తయినట్లు తెలిపారు. 1,634 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటి సర్వే జరుగుతోందని, ఈ సర్వే వివరాలను ప్రతి వారం జరిగే సమావేశాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందిచడం జరుగుతుందని, ఏమైనా సందేహాలున్నా నివృత్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ నాటికి చూస్తే 13,04,396 ఓటర్ల వివరాల పరిశీలన పూర్తయినట్లు తెలిపారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథంతో పాటు వివిధ పార్టీ ప్రతినిధులు ఆర్.వెంకటేశ్వరరావు, తుమ్మల రమేష్, పి.రవికిరణ్, కె.వీరబాబు, ఎస్.అప్పారావు, ఎం.రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వావాను కలసిన కలెక్టర్, ఎస్పీ

కాకినాడ సిటీ: జిల్లాకు వచ్చిన జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావాను కాకినాడ రాయల్ పార్కు హోటల్ వద్ద కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డీవీ రమణమూర్తి ఉన్నారు.

చేయూత లబ్ధిదారులతో ముఖాముఖి



జగనన్న చేయూత లబ్ధిదారులతో మాట్లాడుతున్న చంద్రకళాదీప్తి

కాకినాడ సిటీ: నగరంలోని 6వ వార్డు పేర్రాజుపేట గవర్నమెంట్ స్కూల్‌లో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు జగనన్న చేయూత లబ్ధిదారులతో గురువారం ముఖాముఖి నిర్వహించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సేవాదళ్ కాకినాడ స్మార్ట్ సిటీ అధ్యక్షుడు నల్లబిల్లి సుజాత, మాజీ కార్పొరేటర్లు, అధికారులు, సచివాలయం, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాలు



బాలత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణశుక్రవారాల్లో వరలక్ష్మి వత్రాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. నాలుగు శుక్రవారాల్లోనూ సామూహిక వ్రతాలు నిర్వహించాలని ట్రస్టు బోర్డు నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 18, ఆగస్టు 25, సెప్టెబంబరు 1, సెప్టెంబరు 8వ తేదీల్లో వచ్చే శుక్రవారాల్లో సామూహిక వ్రతాలను నిర్వహించనున్నట్టు ఈఓ డి. నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు. తోరాలు, రూపులు, ఆకులు, చెక్కలు, కొబ్బరి కాయలు, అరటి పండ్లు, గ్లాసు, ప్లేట్లు, పువ్వులు, లక్ష్మీదేవి ఫొటో ఇవ్వడానికి దాతలు ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. వ్రతాలు చేసుకునే మహిళలు కేజీన్నర బియ్యం, కలశ పాత్ర, జాకెట్టు ముక్క మాత్రమే తీసుకురావలసి ఉంటుందన్నారు. వ్రతాలు నిర్వహించే పురోహితులకు దేవస్థానం నుంచి రుసుం చెల్లించనున్నామని ఆయన తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న మహిళలు ప్రతి శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయంలో నిర్వహించే సామూహిక వ్రతాలకు హాజరు కావాలన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్టు ఈఓ తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: శిక్షణతో అనేక కొత్త విషయాలు తెలుస్తాయని, ప్రతి ఒక్కరూ శిక్షణపై పూర్తి బాధ్యతతో వ్యవహ రించి సద్వినియోగం చేసుకొవాలని జిల్లా నోడల్ అధికారి, కాకినాడ కార్పొరేషన్ ఏఓ ఎం.ఏసుబాబు అన్నారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ కార్పొరేషన్, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీల సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న 3వ బ్యాచ్ శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఫ్యాకల్టీ శ్రీకైలాస్ శిక్షణ నిర్వహించగా మున్సిపాలిటీల నోడల్ అధికారులు సీహెచ్ సుజాత, యు.జ్యోతి రామ్, ఎస్‌వీ రామారావు, కె.శ్రీనివాసరావు, కేపీ ప్రసన్న పాల్గొన్నారు. కార్యదర్శులకు ఏసుబాబు సర్టిఫికెట్లు అందజేశారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



పిఠాపురం రోడ్డులోని ప్రైవేటు లే అవుట్ స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ తదితరులు

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్, సభ నిర్వహించే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాలను ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ మేరకు పిఠాపురం రోడ్డులో ప్రైవేటు లే అవుట్‌ను, స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రాలలోని ఖాళీ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఆయా ప్రదేశాల్లో వాహనాలను పార్క్ చేసుకోడానికి అనువైన ప్రదేశాలుగా గుర్తించారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి సామర్లకోటలోని జగనన్న లే అవుట్‌లో సామూహిక గృహ ప్రవేశాల్లో పాల్గొని, అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బహిరంగ సభలో పాల్గొనడానికి ఏర్పాటు చేస్తున్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ శ్రీనివాసు, సీఐలు అబ్దుల్ నబీ, కె.దుర్గాప్రసాద్, ఎస్సైలు అడపా గరగారావు, కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కరపలో కురుస్తున్న వాన

సార్వాపై ఆశల జల్లు

- జోరుగా కురిసిన వర్షం
- పంటలకు మేలన్న రైతులు



వలసపాకలలో బీటలువారిన పంటపొలం

కరప: వేసవిని మించిన ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో సేదతీరారు. వాతావరణం చల్లబడడంతో మహిళలు, వృద్ధులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. వరుణుడి కరుణకోసం ఎదురుచూస్తున్న రైతులు గురువారం మధ్యాహ్నం ఆకాశం మబ్బులు పట్టి, ఈదురుగాలులతో చినుకులు పడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇక నుంచైనా వాతావరణం చల్లబడి, వర్షాలు పడితే పంట పొలాలు మూనదేరి, దుబ్బు కడతాయని రైతులు నక్కా వీరభద్రరావు, పెంకే అప్పన్న, మాదవరపు బాబ్జీ తెలిపారు.

నాడు–నేడు పనులు పూర్తిచేయాలి



నాడు–నేడు పనులపై సమీక్షిస్తున్న అధికారులు

కరప: మండల పరిధిలోని పాఠశాలల్లో రెండో విడతలో చేపట్టిన నాడు–నేడు పనులు సత్వరమే పూర్తి చేయాలని ఈఈ బి.రాధాకృష్ణయ్య సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సమీక్షించారు. నాడు–నేడు పనుల బిల్లులు రెండు రోజులుగా అకౌంట్లలో జమ అవుతున్నాయని, కాబట్టి నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. రెండో విడతలో 38 పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయని, నాణ్యతా ప్రమాణాలతో వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈఈ కోరారు. ఎంఈఓ–1 కె.బుల్లి కృష్ణవేణి, ఏఈఈ కె.వెంకటరాజు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న 'వసుధ ఫ్యాషన్'



వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌లో కొనుగోలు చేస్తున్న మహిళలు

కాకినాడ బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో శ్రీ ద్వారంపూడి పద్మావతి కళ్యాణ మండపం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన 'వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్'లో ప్రదర్శన, విక్రయాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలు మూలల నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50కి పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచమన్నారు. ముంబాయి, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కత్తా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లను తీసుకొచ్చి నగర ప్రజలకు లెటెస్ట్ డిజైనర్ వస్త్రాలను పరిచయం చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన 19వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు.

ఈ–క్రాప్ నమోదుతో ఎంతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న విజయదుర్గ

పెద్దాపురం: ఈ–క్రాప్ బుకింగ్ ద్వారా రైతులకు మంచి ప్రయోజనాలు ఉంటాయని రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ బర్రే నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కట్టమూరులో గురువారం వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ క్రాప్ బుకింగ్, ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వ్యవసాయ సహాయకులు విజయదుర్గ అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు ద్వారా రైతులు ప్రభుత్వం నుంచి సబ్సిడీ, రాయితీలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నల్లల గోవిందు, అడపా సుబ్రహ్మణ్యం, వీఏఏ అమృత వర్షిణి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న మేనేజర్ సాగర్

పెద్దాపురం: ప్రతిభ గల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యాజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని దివిలి కెనరా బ్యాంక్ మేనేజర్ సాగర్ అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి హైస్కూల్ విద్యార్థులకు మంజూరైన స్కాలర్‌షిప్‌ను గురువారం ఆయన అందజేశారు. బీఎం మాట్లాడుతూ విద్యార్థులు తమలోని ప్రతిభను కనబర్చి ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీనివాస్, హిమబిందు, వైఎస్సార్ సీపీ నాయకులు వాసిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.